విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 18, అక్టోబరు 2025

# స్తంభించిన నాపరాళ్ళ సరఫరా..

- పన్నుల వసూళ్ల ప్రవేట్‌కు అప్పగింత
- ఇబ్బంది పడుతున్న కార్మికులు, యాజమాన్యులు

**విశాలాంధ్ర - కొలిమిగుండ్ల:** నాపరాయిపై సీనరేజ్ వసూళ్ల (పన్నుల) నుండి ప్రభుత్వం తప్పుకొని ప్రైవేట్‌కు అప్పగించడంతో నాపరాళ్ల పరిశ్రమ పరిశ్రమలో అయోమయం నెలకొంది. దీంతో పరిశ్రమ పరిస్థితి పెనంలో నుండి పొయ్యి మంటలోకి పడ్డటయింది. నష్టాలతో సంక్షోభంలోకి వెళ్లిన పరిశ్రమను ప్రైవేట్‌కు అప్పగించడంతో మరింత షాక్‌లోకి వెళ్ళింది. సీనరేజీ వసూలపై గుత్తాధిపత్యం సంపాదించుకున్న సుధాకర్ సంస్థ మండలంలో ఎక్కడికక్కడ చెక్పోస్ట్ కార్యాలయాలను ఏర్పాటు చేసి నాపరాయి రవాణాపై నిఘాపెంచి అనుమతి పత్రాలను (రాయల్టీ బిల్లులు) అడుగుతున్నారు. స్థానికంగా ఉండే పాలిష్ ఫ్యాక్టరీలకు స్థానిక అవసరాలకు నాపరాయి రవాణా జరగకుండా ప్రైవేట్ అధికారులు వెంటాడుతుండడంతో రవాణా పూర్తిగా స్తంభించింది. మండల వ్యాప్తంగా నాపరాయి ఖనిజ నిక్షేపాలు విస్తారంగా ఉన్నాయి. నాపరాతి గనుల నుండి ముడి ఖనిజాన్ని వెలికి తీస్తూ వేలాది మంది కార్మికులతో పాటు నాపరాలను గనుల నుండి ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్లు లారీల ద్వారా తరలిస్తూ మరింత మంది ఉపాధి పొందుతు న్నారు. నాపరాయితో పాటు ఇతర ఖనిజాలపై సీనరేజ్ వసూలు చేసేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా సుధాకర్ ప్రైవేట్ సంస్థ వేలం దక్కించుకున్నది. దీంతో ఆ సంస్థ యాజమాన్యం కొలిమిగుండ్ల మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి, కొలిమిగుండ్ల, బెలుం బెలుం సింగవరం మధ్యలో ప్రస్తు తానికి చెక్పోస్టను ఏర్పాటు చేసింది. త్వరలోనే రాఘవరాజు పల్లి, తిమ్మనాయునిపేట మెట్ట, పెట్నికోట లేదా గోరుమానుపల్లి సమీపంలో మరికొన్ని చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తారన్న ప్రచారం జరుగుతున్నది. ప్రైవేట్ సంస్థ చెక్ పోస్ట్‌లను ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేయడంతో నాపరాయి రవాణా పూర్తిగా స్తంభించింది. ఐదు రోజుల నుండి రవాణా నిలిచిపోవడంతో కార్మికులు, దినసరి కూలీలు, గనుల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఓక ట్రాక్టర్ నాపరాలకు రూ.600 రాయల్టీ చెల్లించగా, నేడు అదే ట్రాక్టర్‌కు టన్నుకు రూ.220 చొప్పున దాదాపు రూ.1200 చెల్లించాల్సి వస్తున్నదని యజమానులు తెలుపుతున్నారు. దీంతో చాలామంది గనుల యజమానులు, ట్రాక్టర్ యజమానులు గిట్టుబాటుగాక నాపరాతి గనుల పనులను ఆపేసి పాటు రవాణాను నిలిపేశారు.

## మోసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల:** ఉద్యోగాల పేరిట డబ్బులు వాసులు చేసి మోసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. హెల్త్ అండ్ వెల్త్ పేరుతో దాదాపు నూట యాభై కోట్లకుపైగా దండుకొని మోసం చేసి, నిర్వాహకులను అరెస్ట్ చేయాలని, గత ఐదు రోజులుగా దొర్నిపాడు రోడ్డుపై కొనసాగుతున్న బాధితుల నిరసన దీక్షలో సిపిఐ నాయకులు జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఆళ్లగడ్డ పార్టీ కార్యదర్శి కె.భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు మురళీధర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్నలు పాల్గొని బాధితులకు మద్దతు ప్రకటించి, సంఘీభావం తెలిపారు. బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య ప్రభుత్వాలు తీర్చనంత వరకు ఇలాంటి మోసాలు జరుగుతూనే ఉంటాయని, ప్రజలను మోసం చేసే కంపెనీలు పుట్టుకొస్తుంటాయని, బాధితులకు న్యాయం జరిగే వరకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇల్లు, బంగారం తాకట్టుపెట్టి డబ్బులు కట్టారని, బాధితులకు డబ్బులు తిరిగి చెల్లించకపోతే గృహాలు బ్యాంకులో తనఖా పెట్టి రుణాలు తెచ్చిన వారు రుణాలు కట్టలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని, కావున తక్షణమే నిందితులను అదుపులోకి తీసుకొని, బాధితులకు న్యాయం జరిగేలా, వారి డబ్బును పైసాతో సహా తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు.

## తగ్గింపు ధరలను సద్వినియోగం చేసుకోవాలి

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల:** జీఎస్టీ తగ్గింపుతో క్రీడా పరికరాల రేటు 12 నుంచి 5 శాతం వరకు తగ్గించడం జరిగిందని సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా యువజన సంక్షేమశాఖ, సెట్కూరు, జిల్లా క్రీడా ప్రాధికారసంస్థ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్‌పై అవగాహన కొరకు టాయ్స్, స్పోర్ట్స్ దుకాణాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్కూర్ సిఇఓ మాట్లాడుతూ నూతన జిఎస్టి స్లాబుల సవరణ వల్ల క్రీడా పరికరాలపై జిఎస్టి 12 నుండి 5 శాతానికి తగ్గినదని, తగ్గిన పన్ను భారం వల్ల డబ్బు ఆదా అవుతుందని, క్రీడాకారులకు ప్రోత్సా హకరమన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఎండిఓ సుగుణశ్రీ, సెట్కూరు సూపరిటెండెంట్ శ్యామ్ బాబు, క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు సుదర్శన్, కిశోర్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## కాలవల్లో పూడిక.. ఇబ్బందుల్లో రైతులు

**విశాలాంధ్ర- కోవెలకుంట్ల:** మండలంలో కాలువల నిర్వహణ అధ్వానంగా మారింది. కాలువల్లో పూడిక చేరడంతో సాగునీటి ప్రవాహానికి అవరోధంగా మారింది. గుంజలపాడు రస్తా లో ఎస్సార్ బీసీ10 బ్లాక్ పెద్ద కాలువలో పైనుంచి వచ్చిన చెత్తాచెదారం వల్ల పుడిక ఎక్కువగా చేరడం వల్ల కింది పొలాలకు సాగు నీరు వెళ్లడం లేదు. కొన్నిచోట్ల కాలువలు బ్లాక్ కావడంతో కొన్ని చోట్ల నీరు పంట పొలాల్లో ప్రవహిస్తుంది. ప్రస్తుతం విత్తనాలు వేసుకునేందుకు రైతుల సన్నద్ధమవుతున్నారు. కాలువల నిర్వహణ పట్ల అధికారుల శ్రద్ధ చూడాలని రైతులు కోరుతున్నారు.

## ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు

**విశాలాంధ్ర - చాగలమర్రి:** మండలంలోని మద్దూరుమెట్ట సమీపంలో బైకు నుంచి క్రిందపడి ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని మద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న రవి శంకర్ రెడ్డి పాఠశాలకు ద్విచక్ర వాహనం మీద చాగలమర్రి నుండి మద్దూరుకు వెళుతుండగా గ్రామ సమీపంలోని సర్వీస్ రోడ్డుపై తల తిరిగి బైకు అదుపుతప్పి కిందపడి, తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ ఉపాధ్యాయుడుని టోల్ ప్లాజా అంబులెన్స్‌లో స్థానిక కేరళ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరు వైద్యశాలకు తరలించారు.

## సాక్షిపై కక్ష సాధింపులకు నిరసనగా ఆందోళన

**విశాలాంధ్ర - నందికొట్కూరు:** నెల్లూరు జిల్లాలోని సాక్షి కార్యాలయంపై దాడులు, అక్రమ కేసులకు నిరసనగా నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసనకు దిగిన జర్నలిస్టులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, దాడులను అరికట్టాలని, అక్రమ కేసులను ఎత్తివేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. అనంతరం అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వరికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు నంది విలేకరి గోపి, కందనవోలు సోమన్న, ఆంధ్రప్రభ సామన్న, ఆంధ్రజ్యోతి వెంకటేశ్వర్లు, విశాలాంధ్ర అంజి, సాక్షి నాగేష్, ప్రజా సంఘాల నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు, చెరుకు చెర్ల గాబ్రియల్, మాల మహానాడు శివ ప్రసాద్, విద్యార్థి సంఘాల నాయకులు ఆది, మరి స్వామి, వైసీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో విద్యుత్‌కు అంతరాయం

**విశాలాంధ్ర - ఉయ్యాలవాడ :** మండలంలోని అల్లూరు, హరివరం, మాయలూరు, పుచ్చకాయలపల్లె, గోవిందపల్లె, ఎస్.కొత్తపల్లి, బోడెమ్మనూరు, పెద్దమ్మనూరు, ఇంజోడు, కొండపల్లి, కాకరవాడ, ఆర్.జమల్దిన్నె, ఉయ్యాలవాడ, రూపనగుడి, నర్సిపల్లె, పడిగపాడు, సుద్దమల్ల తదితర గ్రామాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు నిలిపివేస్తున్నట్లు ఏఈ గాజుల హుస్సేన్ బాష తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నిలిపివేస్తున్నామని, వినియోగ దారులు సహకరించాలని ఆయన కోరారు.

## శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారికి పల్లకి సేవ

**విశాలాంధ్ర - బనగానపల్లె:** మండల పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం సందర్భంగా అమ్మవారి పల్లకి సేవ కార్యక్రమం వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ పల్లకి సేవ లో ఆలయ సిబ్బంది, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

# దళితుడికి ఘోర అవమానం

**దర్గాలో టెంకాయ కొట్టకుండా అడ్డుకున్న ముజావర్**

**దళితులను కులం పేరుతో దూషణ**

**విశాలాంధ్ర - నందికొట్కూరు:** మిడుతూరు మండలం జలకనూరు గ్రామంలో కుల వివక్షత కొనసాగుతుంది. దళితులకు దర్గాలోకి ప్రవేశం లేదని దళితుడు మంద ధనరాజును మెడ బట్టి బయటకు గేంటేసిన ఘటన జలకనూరు గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. న్యాయం కోసం బాధితుడు మిడుతూరు పోలీసులను ఆశ్రయించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. వర్షాలు కురవడం లేదని, గ్రామ ప్రజలు అందరూ కలిసి చందాలు పోగు చేసి దర్గా వద్ద పీర్లను నిలబెట్టారు. గురువారం గ్రామస్తులు దర్గా వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు పీర్లకు మొక్కుబడులు చెల్లిస్తూ ప్రార్ధనలు చేశారు. గ్రామానికి చెందిన దళితుడు మంద ధనరాజు పీర్ల స్వామి ప్రేమతో దర్గాలోకి వెళ్లి పీర్లకు టెంకాయ కొట్టడానికి వెళ్ళాడు. అయితే పీఠాధిపతి పింజారి అక్బర్ అతని కుమారుడు అడ్డుకొని, దళితులకు దర్గాలోకి ప్రవేశం లేదని ధనరాజ్‌ను మెడ పట్టి బయటకు తోసివేశాడు. దళితులు దర్గాలో టెంకాయ కొట్ట కూడదు అని గేంటివేశాడు. ఎదురుతిరిగిన ధనరాజ్‌ను కులం పేరుతో దూషించి, కులం పేరుతో దుర్భాషాలు ఆడుతూ మాల, మాదిగలు దర్గా ప్రవేశంలోకి రాకూడదని, దాడికి పాలు పడడం జరిగిందని బాధితుడు తెలిపాడు. ఈ సందర్భంగా శుక్రవారం మిడుతూరు పోలీస్ స్టేషన్లో వారిపై ఫిర్యాదు చేయడం జరిగిందని, తనకు గ్రామంలో దర్గా వద్ద చాలా అవమానం జరిగిందని, న్యాయం చేయాలని బాధితుడు ఏఎస్ఐ సుబ్బయ్యకు కన్నీటి పర్యంతమై వేడుకున్నారు.

## నరేంద్ర మోడీ పర్యటనతో ఒరిగిందేమీ లేదు

**విశాలాంధ్ర - నంద్యాల :** ప్రదాని నరేంద్రమోడీ పర్యటన వలన కర్నూలు, నంద్యాల జిల్లాలకు ఒరిగిందేమి లేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు ఓ ప్రకటనలో శుక్రవారం విమర్శించారు. జీఎస్టీ పన్నును తగ్గించిన సందర్భంగా ఆ నిర్ణయాన్ని తెలియజేయడానికి ఉపయోగపడింది తప్ప అత్యంత వెనుకబడిన రాయలసీమ జిల్లాల్లో కరువును పారదోలేందుకు పెండింగ్‌లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులు, రాష్ట్ర విభజన సందర్భంగా ప్రత్యేక హెూదాపై గాని, వెనుకబడిన రాయలసీమకు ప్యాకేజీ మంజూరు చేసే విషయంలో గాని, ఎలాంటి ప్రస్తావన లేకుండా ఈ సభ జరిగిందన్నారు. ప్రధాని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నరేంద్ర మోడీని పొగిడితే నరేంద్ర మోడీ తిరిగి చంద్రబాబును, పవన్ కళ్యాణ్ పొగడడానికి మాత్రమే ఈ పర్యటన ఉపయోగపడింది తప్ప మరొకటి కాదన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలను రెండు రోజులుగా ప్రయాణాలకు అసౌకర్యం కల్గించి ఎంతో భారీ ఎత్తున ప్రభుత్వం ధనాన్ని ఖర్చు చేసి అధికార దుర్వినియోగం చేశారుతప్ప కర్నూలు, నంద్యాల జిల్లాలకు ఎలాంటి ప్రయోజనం నెరవేరలేదన్నారు. శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులుకూడా కార్పొరేట్ కంపెనిలకు ఉపయోగపడేవే తప్ప ఈ ప్రాంత వెనుకబాటు తనానికి పారదోలడానికి, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎలాంటి వాగ్దానాలు లేవన్నారు. ఈ సభ ఢిల్లీ కేంద్రంలో ఓ హాల్ మీటింగ్లో పెట్టుకోవాల్సిన మీటింగ్ తప్ప ఆంధ్రప్రదేశ్‌కు ఒరిగిందేమీ లేదన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కర్నూలులో సుగాలి ప్రీతి భాయి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.

## వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలి

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ :** వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని, ఏదైనా ఉంటే బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని, అనవసరంగా ఇలాంటి వాటిని రాజకీయం చేయొద్దని ఏపి రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ కాటం రెడ్డి శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ హుస్సేన్ బాష, ఆళ్లగడ్డ మండల కన్వీనర్ శీలం హరికుమార్ రెడ్డి, చాగలమర్రి మండలం కన్వీనర్ కరిమద్దెల నరసింహారెడ్డి, పడకండ్ల టిడిపి నాయకులు బద్రి సుధాకర్ రెడ్డిలు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడుతూ వెల్త్ అండ్ హెల్త్ సొల్యూషన్ సంస్థ పేరుతో రాజారెడ్డి, మహేశ్వర రెడ్డి, వీరారెడ్డి ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. వీరందరూ నాలుగేళ్ల నుండి ఈ కంపెనీ పెట్టి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఇప్పుడు రీసెంట్‌గా డబ్బులు పడకపోవడంతో ప్రజలందరూ బయటకు వచ్చి ధర్నాకు దిగారన్నారు. గత రెండు నెలల క్రితం అనంతపురం లో వీరారెడ్డి పై కేసు నమోదు కాగా ఆళ్లగడ్డ డిఎస్పి విచారించగా ఇదే దొర్నిపాడు గ్రామానికి చెందిన ప్రజలు ఆయన దేవుడు తమకు ఎటువంటి ఇబ్బంది లేదని చెప్పారన్నారు. అప్పటినుంచి రెండు నెలల్లోనే 300 మందికి పైగా డబ్బులు కట్టించుకోవడం జరిగింద న్నారు. డిఎస్పి ఇలాంటి మాయ మాటలు నమ్మవద్దని చెప్పగా ఎవరు పట్టించుకోలేదని తెలిపారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రజల మనిషి అని, మాట్లాడిన ప్రతి మాట అవాస్తవమేనని తెలియజేశారు.

## సమగ్ర ఎరువుల యాజమాన్యంతో అధిక దిగుబడులు

**విశాలాంధ్ర -చాగలమర్రి:** ప్రస్తుత పరిస్థితుల్లో సమగ్ర ఎరువుల యాజమాన్యం ద్వారా పంట పెట్టుబడి తగ్గించి మంచి దిగుబడి సాధించ వచ్చని కర్నూలు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సతీష్ కుమార్ తెలి పారు. శుక్రవారం పట్టణంలోని మూడవ రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి రంగనేతాజీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్య క్రమంలో భాగంగా రైతులకు ఎరువులు యాజమాన్యం, జీవన ఎరువుల ఆవశ్యకత గురించి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేల ఆరోగ్యం కాపాడుకోవడమే మన ముందు తరాలకు మనమిచ్చే బహుమతి అన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## బాధితులకు న్యాయం చేస్తాం

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ :** నియోజకవర్గంలోని దొర్నిపాడులో హెల్త్ అండ్ వెల్త్ ఫైనాన్స్ సొల్యూషన్ బాధితుల నిరసన ఐదవ రోజు కూడా కొనసాగింది. ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల ప్రధాన రహదారిపై టెంట్ వేసుకుని నిరసన చేస్తుండడంతో బస్సులు, లారీల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ దీక్ష శిబిరానికి సీపీఐ, సీపీఎం నాయకులు చేరుకొని సంఘీభావం ప్రకటించారు. దీక్షా శిబిరానికి డిఎస్పి ప్రమోద్ కుమార్ చేరుకొని బాధితులతో మాట్లాడారు. నిందితులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదన్నారు. బాధితులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని, అందుకు తనకు సహకారం అందించాలని డిఎస్పి అన్నారు. గతంలో రుద్రవరంలో రైతులకు కోటి రూపాయలు మోసం చేసిన దళారిపై చర్యలు తీసుకుని, వారి డబ్బులు వారికి వెనక్కి ఇప్పించానన్నారు. తమకు కొంత సమయం ఇచ్చి చర్యలు తీసుకోకపోతే అప్పుడు నిరసన చేసిన సమంజసంగా ఉంటుందన్నారు. 15 రోజుల్లో న్యాయం చేయలేని పక్షంలో బాధితులు తనను ప్రశ్నించవచ్చున్నారు. ఏది ఏమైనా బాధితులకు న్యాయం చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**విశాలాంధ్ర - కొలిమిగుండ్ల:** మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ భవనం నందు మండల సర్వ సభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఎంపీపీ నాగవేణి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరుగుతుందన్నారు. గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా మండల శాఖ అధికారులు, కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఆయా శాఖల ప్రగతి నివేదికలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

## రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం కృషి

**విశాలాంధ్ర - జూపాడుబంగ్లా:** రైతుల శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టిడిపి సీనియర్ నాయకులు తర్తూరు దేవస్థానం ఆలయ చైర్మన్ మండడి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తరిగొప్పులలో గ్రామంలో విలేజి అగ్రికల్చర్ అసిస్టెంట్ సాగర్‌తో కలిసి సబ్సిడీ శనగ విత్తనాల మందడి నారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే టిడిపి ధ్యేయమని పేర్కొన్నారు. రైతుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలు ఇప్పటికీ ప్రజల మనసుల్లో నిలిచి పోయాయని అన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీఈఓ వీరమ్మ, టిడిపి నాయకులు నాగిరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వాలీబాల్ టీమ్ కోచ్‌గా బండారి రాజేష్

**విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్:** యూత్ గేమ్స్ నేషనల్ వాలీబాల్ ఛాంపియన్ షిప్ 2025కి లెవెల్-2 వాలీబాల్ కోచ్ నక్క శ్రీనివాస్ రావు సారథ్యంలో రాష్ట్ర వాలీబాల్ టీమ్ కోచ్‌గా పట్టణంలోని ఇందిరా నగర్‌కి చెందిన సీనియర్ క్రీడాకారుడు బండారి రాజేష్‌ని నియమించి నట్లు ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఆత్మకూర్ స్పోర్ట్స్ క్లబ్ కార్యాలయం నందు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా నంద్యాల జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి రాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ క్రీడాకారులకు అన్ని విధాలుగా అవకాశం అందిస్తున్న గొప్ప సంస్థ ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ అని కొనియాడారు. సీనియర్ క్రీడాకారుడు బండారి రాజేష్ మాట్లాడుతూ నాకు జాతీయ స్థాయిలో రాష్ట్రస్థాయి వాలీబాల్ టీమ్‌కి కోచ్‌గా అవకాశం కల్పించిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా, ఆత్మకూర్ వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ నిమ్మి కృష్ణ యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. జిల్లా వృత్తి నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఆత్మకూర్ స్టేడియం ఖోఖో కోచ్ మహేబూబ్ పాల్గొన్నారు.

## కార్యదర్శులుగా పదోన్నతులు

**విశాలాంధ్ర - రుద్రవరం:** మండల పరిధిలోని డి.కొట్టాల, రుద్రవరం-3 సచివాలయాలకు కార్యదర్శులుగా పదోన్నతులు పొంది ఇద్దరిని నియమించడం జరిగిందని పరిపాలన అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల మండలంలోని చాబోలి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న హితేంద్ర, రుద్రవరం మండలంలోని చిన్న కంబలూరు గ్రామంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సునీల్ కుమార్ రెడ్డిలకు ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులను కల్పించిందన్నారు. ఇందులో భాగంగానే మండలంలోని డీ కొట్టాల సచివాలయ కార్యదర్శిగా హితేంద్రను, మండల కేంద్రంలోని సచివాలయం 3కు సునీల్ కుమార్ రెడ్డి లను కార్యదర్శులుగా నియమించడం జరిగిందని ఆయన తెలిపారు.

## మండలంలో 70 దేవాలయాలకు దూపదీప నైవేద్యాలు

**విశాలాంధ్ర - శిరివెళ్ల:** మండల పరిధిలో అన్ని గ్రామాల్లో దాదాపుగా 70 దేవాలయాలలో దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రైవేట్ దేవాలయాలకు కార్తీక మాసంలో నిత్యం దీపం వెలగాలని ఉద్దేశంతో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ధూపదీప నైవేద్యాలు అందించడం జరుగుతుందని నంద్యాల జిల్లా దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఏ నాగమల్లేశ్వర రెడ్డి తెలిపారు. నాగ మల్లేశ్వర రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది దాతల సహకారంతో ఆంధ్ర ప్రదేశ్‌లో కార్తీక మాసంలో మూడు వేల దేవాలయాలకు దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధూపదీప నైవేద్యాలు అందించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలలో ఐదువేల దేవాలయాలకు కార్తీక మాస సందర్భంగా నిత్యం దీపారాధన జరగాలన్న ఉద్దేశంతో ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐదువేల దేవాలయాలకు ధూప దీప నైవేద్యాలు అందించడం జరుగుతుందని నాగ మల్లేశ్వర రెడ్డి తెలిపారు. ప్రతి గ్రామంలో కూడా ఆధ్యాత్మిక వైభవాన్ని పెంపొందించేందుకు ఈ ట్రస్ట్ వారు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దానధర్మచారిబుల్ ట్రస్ట్ శిరివెళ్ల మండల సభ్యులు సుబ్బరాయుడు, నరసింహ, నాగరాజు, సుబ్బారావు, గోవిందు, మహేష్, రమణ, గోవర్ధన్ పాల్గొన్నారు.

## యువత ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటాలి : జిల్లా కలెక్టర్

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల:** యువజన ఉత్సవాల్లో యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా యువజన సంక్షేమశాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో నిర్వహించబడనున్న నంద్యాల జిల్లా స్థాయి యువజన ఉత్సవాల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ యువత తమ ప్రతిమను ప్రదర్శించ దానికి యువజన ఉత్సవాలు అద్భుత వేదికగా నిలుస్తాయన్నారు. 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను చాటుకోవాలని ఆమె కోరారు. ఈ నెల 29న నంద్యాల శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలు ఏడు విభాగాల్లో నిర్వహించబడతాయని, జానపద నృత్యం, జానపద గీతం, కథా రచన, కవితా రచన, డిక్లేమేషన్, పెయింటింగ్, ఇన్నోవేషన్ సైన్స్ మేళా ఉన్నాయని సెట్కూరు సీఈఓ డా కె. వేణుగోపాల్ తెలిపారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలు రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన వారు జాతీయ స్థాయికి ఎంపికవుతారని తెలిపారు. డిఐఓ జనార్ధన్ రెడ్డి, ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ నాయక్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, సెట్కూరు పర్యవేక్షణ అధికారి పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్పిటల్‌లో క్రిటికల్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపన

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే ప్రభుత్వ సంకల్పంలో భాగంగా నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో నూతనంగా ఏర్పాటు చేయ నున్న క్రిటికల్ కేర్ యూనిట్‌కు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ శంకుస్థాపన చేశారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు అత్యవసర, క్లిష్ట పరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు ఉద్దేశించిన ఈ క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతని స్తోందన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్‌ను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికా రులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, డాక్టర్ సోహెల్, కౌన్సిలర్లు శ్రీదేవి, జైనాబి, ఖండే శ్యామ్ సుందర్ లాల్, మాజీ కౌన్సిలర్ శివశంకర్ యాదవ్, కామిని మల్లికార్జున, పబ్బతి వేణు, బ్యాంకు తిమ్మయ్య, వైద్య కళాశాల ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## టోల్ ప్లాజా ప్రారంభం, వసూళ్లులను అడ్డగించిన గ్రామస్తులు

**విశాలాంధ్ర - పాములపాడు :** జాతీయ రహదారి 340సీ నిర్మాణం పూర్తి అవ్వకముందే రుద్రవరం గ్రామంలోని టోల్ ప్లాజా ప్రారంభించారని గ్రామస్తులు నేషనల్ హైవే అధికారులపై టోల్ ప్లాజా గుత్తేదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామంలో సర్వీస్ రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని పొలాలకు వెళ్లడానికి రస్త ఏర్పాటు చేయకుండా వదిలే సారని కాంట్రాక్టర్లకు నేషనల్ హైవే అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని సర్పంచ్ రామ స్వామి, ఎంపీటీసీ అరుణ, మాజీ సర్పంచ్ రామసుబ్బయ్య, టీడీపీ నాయ కులు సురేష్, తెలుగు యువత అధ్యక్షుడు కరీం బాషల ఆధ్వ ర్యంలో టోల్ ప్లాజా వద్ద వాహ నాలను అడ్డుకొని రాస్తారోకో నిర్వహించారు. నేషనల్ హైవే పీడీ పద్మ టోల్ ప్లాజా సిబ్బంది సంఘటన స్థలానికి చేరు కొని రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్తులతో మాట్లాడగా వారు విని పించక పోవడంతో ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్సై సురేష్ బాబు సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యులు స్వాములు, మాజీ ఎంపిటిసి రామేశ్వరమ్మ, బుడ్డన్న గౌడ్, హుస్సేన్ బాష, బషీర్ అహ్మద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 18, అక్టోబరు 2025

# మోడీ పర్యటనతో సీమ ప్రజలకు నిరాశ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జిల్లా పర్యటన వల్ల రాయలసీమకు ఎలాంటి ప్రయోజనం అదనంగా రాలేదని, విభజన హామీలు ప్రత్యేక హోదా అంశాలపై ఊసే ఎత్తకపోవడం ప్రజలను మోసం చేయడమే అని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్ బాబులు శుక్రవారం ప్రకటనలో విమర్శించారు. ఈనెల 16న జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా సూపర్ సిక్స్ సూపర్ జీఎస్టి, జీఎస్టీ వల్ల ప్రజలకు లాభాలు జీఎస్టీ పండగ పేరుతో కూటమి ప్రభుత్వం లక్షలాది మందిని సమీకరించి బహిరంగ సభ నిర్వహించిన మోడీ వెనుకబడిన ప్రాంతాలకు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నిధులు ఇస్తారని ఆశించినప్పటికీ నిరాశ మిగిలిందని, రాష్ట్ర విభజన ప్రత్యేక హోదా విభజన హామీల పట్ల నోరు మెదవకపోవడం వాటిని అమలు చేయాలని ముఖ్యమంత్రి ఉపముఖ్యమంత్రి కూడా ప్రధాన దృష్టికి తీసుకుపోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. డబుల్ ఇంజన్ సర్కార్ తో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఒకరిపై ఒకరు పొగడ్తలు,గొప్పలు చెప్పుకున్నారు తప్ప ఆంధ్రప్రదేశ్ కు రావలసిన నిధులపై ప్రశ్నించకపోవడం ప్రజలను మోసం చేయడమన్నారు.

**పాత ప్రాజెక్టులకే శంకుస్థాపన:** ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్‌లో అనేక పాత ప్రాజెక్టుల కొనసాగుతున్నాయని, డ్రోన్ పరిశ్రమ ప్రారంభమై చాలా కాలం అవుతున్నా, కొప్పర్తి పారిశ్రామిక కారిడార్ గతంలోనే ప్రారంభమైనవని, కొత్తగా ఏ ఒక్క ప్రాజెక్టు శంకుస్థాపన చేయకపోవడం బాధాకరమైన అన్నారు. ప్రథమ ఆంధ్రప్రదేశ్ రాజధాని కర్నూలు నగరంలో ఏర్పాటు కావలసిన హైకోర్టు బెంచి ప్రస్తావన మోడీ ప్రస్తావించలేదని, కర్నూలు జిల్లా ప్రజలు ఎంతో ఎదురుచూసిన వారికి నిరాశ మిగిల్చారని తెలిపారు.

**కడప ఉక్కు ఫ్యాక్టరీపై నిర్లక్ష్యం:** రాష్ట్ర ముఖ్యమంత్రి కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై ప్రసంగించినా, దీనిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎలాంటి స్పందన ఇవ్వలేదని, దీన్ని బట్టి చూస్తే కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటయ్యే అవకాశాలు లేవని, ఇప్పుడు న్నటువంటి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు దారులు తెరిచారని విమర్శించారు. జీఎస్టి పెంచింది వాళ్లే తగ్గించింది వాళ్లే ఎందుకు ఈ పండగలు, ఎవరిని మోసం చేయడానికి కేంద్రంలోని ఎన్డీఏ గవర్నమెంట్ జీఎస్టీ స్లాబ్లు పెంచి, పదేళ్ల ప్రజల నుండి రక్తం పీల్చి నేడు జీఎస్టీ స్లాబ్‌లో మార్పులు చేసి ప్రజలకు ఒక్కొక్కరికి రూ.20 వేల ఆదాయం వస్తుందని చెప్పడం తగదని, పదేళ్ల నుంచి వసూలు చేసిన జీఎస్టీ డబ్బులు ప్రజలకు తిరిగి ఇస్తారా అని ప్రశ్నించారు.

**ప్రత్యేక హోదా విభజన హామీల అమలు కోసం ఉద్యమాలు కొనసాగిస్తాం :** పార్లమెంట్ సాక్షిగా రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇచ్చిన హామీలు అమలుతో పాటు ప్రత్యేక హోదా వచ్చేంతవరకు సీపీఐ కలిసివచ్చే పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు కొనసాగిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఆంధ్రప్రదేశ్ ప్రజలు మోసం చేస్తుందని వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్రత్యేక ప్యాకేజీ నూతన పరిశ్రమ సాధన కోసం ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు.

**కర్నూలు జిల్లాకు తీరని అన్యాయం:** రాష్ట్రంలో 26 జిల్లాల్లో కర్నూలు జిల్లా పూర్తిగా వెనుకబడిందని అధికారంలోకి వచ్చి ఉంటేనే ప్రాజెక్టులునిధులు నిధులు కేటాయించి పూర్తి చేస్తామన్న సీఎం చంద్రబాబు ప్రస్తుతం వాటి గురించి మరిచిపోయారని, పశ్చిమ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉందని జిల్లాలో పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టు, ఆర్డీఎస్ కుడి కాలువ, సిద్దేశ్వరం అలుగు ప్రాజెక్టులు పూర్తి చేయడానికి నిధులు కేటాయింపులు చేయకుండ చంద్రబాబు ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని, భవిష్యత్తులో పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిధులకు సాధించడం కోసం పెద్ద ఎత్తున ఆందోళనలకు పలుకుంటామని వారు తెలిపారు. మోడీ పర్యటన వల్ల ఒరిగిందేమీ లేకపోగా ప్రజాధనం వందలాది కోట్ల రూపాయలు వృధాగా ఖర్చు చేశారని, ఈ డబ్బులు జిల్లాలో ఏదైనా ప్రాజెక్ట్ కోసం ఖర్చు పెట్టినా కొంత అభివృద్ధికి ఉపయోగపడేదని వారు అన్నారు.

## చిట్యాల గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: వైసీపీ రాష్ట్ర పిలుపుమేరకు కోటి సంతకాలకు వచ్చిన పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి వాహనాన్ని అడ్డుకోవడంతో ఇరు వర్గీయుల మధ్య వాగివాదం చోటుచేసుకుని ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గీలను చదరగొట్టారు. ఈ గొడవలో ఇరు వర్గీయులకు చెందిన రెండు వాహనాలు అద్దాలు ధ్వంసం అయ్యాయి. శుక్రవారం మండల పరిధిలోని కోయిలకొండ, చిట్యాల, ఆలంకొండ గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటుచేసి కోటి సంతకాల సేకరణ ప్రవేశపెట్టారు రచ్చబండలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకి తీసుకెళ్లాలని కార్యక్రమాన్ని చేపట్టారు. కోయిలకొండ గ్రామంలో రచ్చబండ కార్యక్రమం ముగించుకొని చిట్యాల గ్రామానికి వెళ్లారు రచ్చబండను అడ్డుకోవాలని చిట్యాల టిడిపి వర్గీయులు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తూ గొడవ చేశారు. టిడిపి, వైసీపీ వర్గీయులకు గొడవ చోటు చేసుకుంది పోలీసులు వెంటనే అల్లరి మొక్కలను చెదరగొట్టి ఉద్రిక్తను సద్దుమణిగించారు. చిట్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసి, పేద విద్యార్థులకు అన్యాయం చేస్తుందన్నారు. పేదల ఆరోగ్యంగా ఉండాలని వైసీపీ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ నిలిచిపోవడం సిగ్గుచేటన్నారు. ఎంతమంది కలిసికట్టుగా వచ్చి అడ్డగించిన వైఎస్ఆర్సిపి పార్టీని కదిలించలేరని ఈ సందర్భంగా వారు తెలిపారు. గొడవలు పెట్టడానికి గ్రామాలకి రాలేదని, కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని తెలియజేసుకు వచ్చామన్నారు. రానున్నది వైసీపీ అని, మరోసారి జగన్ ముఖ్యమంత్రి అవుతాడని ఆమె జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ ఆర్.బి.వెంకట్రాముడు, న్యాయవాది మహేశ్వర్ రెడ్డి, మాధవరావు, బాలమధి, గోవిందరాజులు, భీమ్ రెడ్డి, లక్క సాగరం రాముడు, తులసి గౌడ్, సుదర్శనమాచారి, అంకుదాడు బాలు సుభాష్, జనార్ధన్, జయరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజవర్ధన్ రెడ్డికి ఘన నివాళులు

విశాలాంధ్ర - గూడూరు: టీడీపీ సీనియర్ నాయకులు, జిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి తనయుడు కర్నూలు మాజీ ఎంపీపీ స్వర్గీయ డి.రాజవర్ధన్ రెడ్డి 47వ జయంతిని పురస్కరించుకొని మండల టిడిపి నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. శుక్రవారం పట్టణంలో కౌన్సిలర్ రేమట సురేష్, టి.శ్రీనివాసులు, బొజ్జ పౌలు, మన్సూర్ బాష, పి.పరశురాముడు పాల్గొని రాజా వర్ధన్ రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్‌చేసి, వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చికెన్ వహీద్, బి.ఆదాము, చెంచుల విజయ్, కె.విజయ్, గిడ్డయ్య, నాగేశ్వర్ రెడ్డి, చంటి, ఇమ్మానియేల్, రంగయ్య, మణి రాజు, అబ్రహం పాల్గొన్నారు.

## ఏపీయూడబ్ల్యూజే సంఘం నాయకులు ఐక్యంగా ఉన్నాం

విశాలాంధ్ర - హొళగుంద: మండల ఏపీయూడబ్ల్యూజే సంఘం నాయకులు అందరూ కలిసికట్టుగా ఐక్యంగా ఉన్నామని మండల ఏపీయూడబ్ల్యూజే సంఘం నాయకుడు సిహెచ్ నాగరాజ్ అన్నారు ఎల్ఎల్‌సి గెస్ట్ హౌస్‌లో శుక్రవారం మండల ఏపీయూడబ్ల్యూజే సంఘం సమావేశం జరిగింది సమావేశంలో సంఘం నాయకుడు సిహెచ్ నాగరాజ్ మాట్లాడుతూ ఓ చిన్న సమస్య వచ్చిందని, గౌరవాధ్యక్షుడిని తొలగించినట్లు వచ్చిన వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఖండించారు. తాము ఎవరిని తొలగించలేదని, పెద్ద నేరం చేసి ఉంటే అలాంటి వారిని జిల్లా, తాలూకా కమిటీ మేరకు చర్చించి, చర్యలు తీసుకుంటామే తప్ప సంఘం నాయకులను ఎలాంటి తొలగించే అధికారం తమకు లేదన్నారు. గౌరవ అధ్యక్షుడిని తొలగించినట్లు తాము ఎవరికి రాతపూర్వకంగా ప్రకటించలేదని, పుకార్లు నమ్మవద్దని పత్రికల్లో వచ్చిన వార్తలు ఎలాంటి నిజం లేదన్నారు. ఏపీయుడబ్ల్యూజే సంఘం నాయకులు ఎవరు అపార్థం చేసుకోవద్దని, జర్నలిస్టుల సమస్యల కోసం సంఘం ఎప్పుడు ముందుండి పోరాడుతుందన్నారు. సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే సంఘం నాయకులు విరుపాక్షి, రవికాంత్, నాగప్ప, నాగరాజు, బాష, సంజయ్, మహేష్, మంజునాథ్, విశ్వనాథ్, ముధస్సర్, తాహెర్, అమీర్ సాబ్, పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర -పత్తికొండ: డెంగ్యూ, మలేరియా వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ రామనాథ్ రావు, జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. శుక్రవారం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి డెంగ్యూ, మలేరియా కేసులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్వరం వచ్చిన ప్రతి కేసును ఖచ్చితంగా రక్త పరీక్షలు చేయాలని, పాజిటివ్ కేసులను కర్నూలు జీజీహెచ్‌కు రెఫర్ చేయాలన్నారు. ఆసుపత్రిలో రికార్డులు, ల్యాబ్ రికార్డులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు కల్పన, హారిక, సత్యనారాయణ సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, సూపర్ వైజర్స్ సాయిబాబా, ప్రకాశ్, గంగరత్నమ్మ, రమేష్, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా మూడు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ప్రధాని మోడీ బహిరంగ విజయవంతం చేసిన జిల్లా ప్రజలకు, అధికార యంత్రం, కూటమి నాయకులకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు, మంత్రి టీజీ భరత్‌లు అభినందనలు తెలిపారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో వారు మాట్లాడుతూ రాయలసీమలో పెట్టిన ఏ సభ అయినా సూపర్ సక్సెస్ అవుతున్నాయన్నారు. కడపలో మహానాడు, అనంతపురంలో సూపర్ సిక్స్, సూపర్ హిట్, కర్నూలులో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం విజయవంతం అయ్యాయన్నారు. రాయలసీమ ప్రజలు చాలా చైతన్య వంతులన్నారు. ఈ ఇక్కడి నుండి ప్రదానులు, రాష్ట్ర ముఖ్య మంత్రులు, రాష్ట్రపతులను అందించిన గడ్డ అని కొనియాడారు. ప్రదాని నరేంద్రమోడీ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్ సహకారంతో పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకువచ్చి అభివృద్ధి పరుగుతు పెడుతుందన్నారు. ఉత్తరాంధ్ర విశాఖలో డేటీ హబ్ సెంటర్, రాయలసీమ కర్నూలులో డ్రోన్ హబ్, కోస్తా అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ, అనంతపురంలో ఆటో మొబైల్ హబ్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 16 మాసాల్లో పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకు వస్తూ ఉపాధి అవకాశాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. మోడీ సహకారంతో ఇవన్నీ చేయడం జరుగుతుందన్నారు. వైసీపీ ప్రతీదీ రాజకీయం చేస్తుందని విమర్శించారు. ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, దస్తగిరి, ఎంపీ బస్తిపాడు నాగరాజు, జనసేనా నేత సురేష్ తదితరులు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. కుడా చైర్మెన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు నాగేశ్వరరావుయాదవ్, ఆకేపోగు ప్రభాకర్, మాజీ ఎంపీ సంజీవకుమార్, నాగరాజు యాదవ్, నాగేంద్రకుమార్, నవీన్ పాల్గొన్నారు.

## కోట్ల రూపాయల దుర్వినియోగమే తప్ప ఒరిగిందేమీ లేదు

విశాలాంధ్ర - ఓర్వకల్లు : మండలంలోని నన్నూరు విలేజ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీఎస్టీ పేరుతో బహిరంగ సభ నిర్వహించడం జరిగిందని, ఈ సభ వల్ల ప్రజలకి ఒరిగిందేమి లేదని సీపీఐ మండల కార్యదర్శి రమేష్ శుక్రవారం విమర్శించారు. మండల కార్యాలయంలో సీపీఐ మండల సహయ కార్యదర్శి సుధాకర్ అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పలేదన్నారు. పదివేల బస్సులను బహిరంగ సభకు బస్సులు తరలించడంలో బస్సులేక ప్రజలు ఎక్కడికైనా పోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఈ బహిరంగ సభకు రూ.350 కోట్లు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు.. సభలో యువకుడి మృతి బాధాకరం : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగసభలో విద్యుదాఘాతానికి గురై మునగలపాడు గ్రామానికి చెందిన యువకుడు మృతి చాలా బాధాకరమని, ఓర్వకల్లు మండల సీపీఐ సమితి తరపున సంతాపాన్ని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

## కంబలదిన్నె నుంచి ఎమ్మిగనూరుకు రోడ్డు వేయాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు: కంబలదిన్నె నుంచి ఎమ్మిగనూరుకు రోడ్డు వేయాలంటూ శుక్రవారం మండల పరిధిలోని కంబలదిన్నె గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, సహాయ కార్యదర్శి చంద్ర, తిక్కన్నలు మాట్లాడుతూ కంబలదిన్నె నుంచి ఎమ్మిగనూరుకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారిందన్నారు. దీంతో గర్భిణులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రోడ్డు సరిగ్గా లేనందున చాలా సార్లు ప్రమాద సంభవించి అనేక మంది గాయాలయ్యారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్నా రోడ్లు వేయడంలో ఘోరంగా విఫలం చెందారని ఆరోపించారు. ఇంచార్జీలు కమీషన్లు అడగడానికి ముందు ఉంటారు గానీ, రోడ్లు వేయడంలో వెనుకబడి ఉంటారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే కంబలదిన్నె నుంచి ఎమ్మిగనూరుకు రోడ్డు వేయాలని, లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రాము, బడేసాహేబ్, హుస్సేన్ సాబ్, హాజీ వలి, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజవర్ధన్ రెడ్డి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - సి.బెళగల్: టీడీపీ సీనియర్ నాయకులు జిల్లా కేడీ సీసీ బ్యాంక్ చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి కుమారుడు కర్నూలు మండలం మాజీ ఎంపీపీ డి.రాజ వర్ధన్ రెడ్డి 47వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. మండల కేంద్రంలోని పార్కులో డి.రాజవర్ధన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, కేకును కట్ చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కర్నూలు మండల మాజీ ఎంపీపీ డి.రాజ వర్ధన్ రెడ్డి సేవా గుణం ప్రజల ప్రేమానురాగాలతో ప్రజల హృదయాలో సుస్థిర స్థానం సంపాదించుకున్న నాయకుడని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు సింగిల్ విండో చైర్మన్ చిన్న తిమ్మప్ప, మండల కన్వీనర్ చంద్రశేఖర్, బాలాజీ వెంకటేష్, మీ సేవ రామకృష్ణ, పోలకల్ అమర్, ధనుంజయ, డిష్ వెంకటేష్, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కోడుమూరు: కర్నూలు కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి తనయుడు కర్నూలు మాజీ ఎంపీపీ దిగం గతనేత డి.రాజ వర్ధన్ రెడ్డి 47వ జయంతి వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక తుంగభద్ర ప్రాజెక్టు సబ్ డివిజన్ మైదానంలో కోడుమూరు పట్టణ అధ్యక్షుడు గంగాధర్ నాయుడు ఆధ్వర్యాన టీడీపీ నేతలు,కార్యకర్తలు వేడుకలలో భాగంగా ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, రవి గౌడ్, గోపాల్ నాయుడు, బడేసా గౌడ్, విజయ కుమార్ యాదవ్, పులకుర్తి సురేంద్ర, గోరంట్ల మధు పాల్గొన్నారు.

## నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించండి

విశాలాంధ్ర -కర్నూలు సిటీ: ప్రజాధనంతో నిర్మించే అభివృద్ధి పనుల్లో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నాణ్యత తనిఖీలు చేశాకే బిల్లులు చేయాలని రాష్ట్ర ప్రజారోగ్య సాంకేతిక శాఖ చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్‌రావు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన నిర్మాణంలో ఉన్న నగరపాలక సంస్థ నూతన భవనం, సుంకేసుల జలాశయం - ఎస్ఎస్ ట్యాంకు పైప్‌లైన్ పనులను పరిశీలించారు. పనుల జాప్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా పైప్‌లైన్, నూతన కార్యాలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈ గిరిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## పార్వతమ్మకు ఘన నివాళి : సీపీఐ

విశాలాంధ్ర - కర్నూలు : సీపీఐ, విశాలాంధ్ర పత్రికా కార్యాలయంలో 20 ఏళ్ల పాటు స్వీపర్‌గా పనిచేసి వయసు రీత్యా గత కొంత కాలం నుండి అనారోగ్యానికి గురై పార్వతమ్మ మృతి చెందింది. శుక్రవారం విషయం తెలుసుకున్న సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శి మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యవర్గ సభ్యులు భద్రకుమార్, నగర నాయకులు రామాంజనేయులు, గిరి ప్రసాద్ నగర్ శాఖ కార్యదర్శి నీలకంఠ, మాజీ కార్పొరేటర్ బీసమ్మ, చాకలి వెంకటేష్ తదితరులు పార్వతమ్మ స్వగృహానికి వెళ్లి, ఆమె మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ, విశాలాంధ్ర కార్యాలయంలో స్వీపర్‌గా 20 ఏళ్లు పని చేసిందని, ఆఫీస్ పని విషయంలో చాలా నిబద్ధతతో, అంకితభావంతో ఉండేదన్నారు. పార్టీ ప్రతి కార్యక్రమానికి జెండాచేత పట్టుకుని ముందు ఉండేదని, పార్వ తమ్మ కొంత కాలంలో అనారోగ్యానికి గురై గురువారం మృతి చెందిం దన్నారు. పార్వతమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇవ్వాలన్నారు. పార్వతమ్మ మృతికి సీపీఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గిడ్డయ్య, కెం.జగన్నాథంలు తమ సంతాపం, సానుభూతిని తెలిపారు.

## లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై రివ్యూ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : కర్నూలు కోర్టు కాంపౌండ్‌లోని న్యాయ సేవా సదన్ నందు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై రివ్యూ మీటింగ్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, చట్టపరమైన సలహాలు, జైలు విజిట్లు, కేసుల వివరాలు, పరిష్కారం తదితర అంశాలను వివరించారు. ఎన్ని కేసెస్‌లలో బెల్స్ మంజూరు చేశారో కేసులస్థితిగతులను తెలుసుకొని వాటిని ఏ విధంగా త్వరిత గతిన పరిష్కరించాలో అనే దానిపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఎ.సులోచన పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ కృషి

విశాలాంధ్ర- పత్తికొండ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ ఎల్లవేళలా కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, బలరాంలు అన్నారు. శుక్రవారం ఎస్టీయూ నాయకులు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి పాఠశాలలలో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని ఎస్టీయూ సభ్యత్వానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై మొట్టమొదట స్పందించే సంఘం ఎస్టీయూ అన్నారు. 2025 డీఎస్సీలో ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన నూతన ఉపాధ్యాయులు ఎస్టీయూ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు మారుతి, వెంకటేశ్వర్లు, చెన్నకేశవరావు, ఇక్బాల్ హుస్సేన్, వెంకటేష్ నాయక్, తిప్పన్న, రాఘవేంద్ర, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సర్వజన వైద్యశాలకు ట్రాలీలు, వీల్‌చైర్ విరాళం

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కీ.శే.రాజ వర్ధన్ రెడ్డి 47వ జయంతి సందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి విష్ణు సేన ఆధ్వ ర్యంలో ఆసుపత్రికి నాలుగు ట్రాలీలు, ఒక వీల్ చైర్‌ను విరాళంగా అందజేశారు. పేద రోగులకు బెడ్షీట్లు పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా వైద్య సేవలకు తోడ్పడుతున్న విష్ణు సేన సిబ్బందికి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి ఆసుపత్రి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు రామాంజ నేయులు, బి.తాంద్రపాడు గ్రామ సర్పంచ్ ఆకేపోగు జయన్న తదితరులు పాల్గొన్నారు.

## జయంతి, పట్టాభిషేక మహోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: శ్రీ కృష్ణదేవరాయల జయంతి, పట్టాభిషేక మహోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బలిజ సంఘం అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మన్న, రవి కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల 496వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి గజమాలతో బలిజ సంఘం నాయకులు నివాళులర్పించారు. అనంతరం అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మన్న, రవికుమార్ మాట్లాడుతూ చెరువులు, కాలువలు తవ్వించి, దేవాలయాలు నిర్మించి, తెలుగు నేలకు శ్రీకృష్ణదేవరాయలు చేసిన విశేషమైన సేవలను, తెలుగు భాష వైభవాన్ని పెంపొందించిన రీతిని కొనియాడారు. నగరంలో అసంపూర్తిగా ఉన్న కాపు భవన్ నిర్మాణం పూర్తి చేయాలని, కాపు కార్పొరేషన్‌కు తగినన్ని నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాపు నాడు రాష్ట్ర అధ్యక్షులు అర్జా రామకృష్ణ, సంఘం ప్రధాన సలహాదారులు డా.సోమశేఖర్ సింగంశెట్టి, ఉపాధ్యక్షులు ఈశ్వర్ కుమార్, కార్యవర్గ సభ్యులు సీనియర్ అడ్వకేట్ ఓంకార్, ఆంజనేయులు, శ్రీనివాసులు, శోభన్ బాబు పాల్గొన్నారు.

## సీనియర్ నాయకున్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట

విశాలాంధ్ర - నందవరం: ఇటీవల అనారోగ్యానికి గురై బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొంది స్వగృహం చేరుకున్న టిడిపి సీనియర్ నాయకులు నాగరాజు గౌడును మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, యువ నాయకుడు ఎర్రకోట రాజీవ్ రెడ్డి కలిసి నాగరాజ్ గౌడ్, పుష్పవతిని నందవరంలోని వారి స్వగృహనికి వెళ్లి పరామర్శించి, చికిత్స పొందిన తీరు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మంత్రాలయంలోని గోశాల వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొంది ఇంటికి వచ్చిన నందవరం గ్రామ 11వ వార్డు వైసీపీ మెంబర్ చాంద్ తాత కుమారుడు తాహెర్ బాషను, మాజీ ఎమ్మెల్యే చెన్న కేశవ రెడ్డి, యువ నాయకుడు ఎర్రకోట రాజీవ్ రేడ్డి కలిసి వార్డు నెంబర్ చాంద్ తాత ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారి వెంట వైసీపీ రైతు విభాగం ప్రతినిధి గడ్డం నారాయణ రెడ్డి, జెడ్పిటిసి నిఖిల్ చక్రవర్తి, వైఎస్ఆర్ సీపీ నాయకులు చుక్క మల్లేష్, లింగమూర్తి, ఒ.లక్ష్మన్న, బసవరాజ్ గౌడ్, రంగముని, పల్లే సోమశంకర్ రెడ్డి, రాఘవరెడ్డి, రాజారెడ్డి, పెద్దకోత్తిలి పంచాయతీ సర్పంచ్ శివన్న, వెంకట్రామిరెడ్డి, రఘు, దస్తగిరి, శాంతిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

విశాలాంధ్ర - కర్నూలు: సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ రెడ్డి, వివిధ జిల్లాల రిపోర్టర్లపై కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని జర్నలిస్టు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడ బ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోరంట్లప్ప, కేజీ శ్రీనివాసులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి శ్రీనివాస గౌడ్, రాయలసీమ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీనివాసులు మాట్లాడుతూ నెల్లూరు జిల్లా పోలీసులు సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ రెడ్డిపై అమాను షంగా వ్యవహరిస్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. నోటీషులు ఇచ్చే పేరుతో రెండు రోజులుగా హైదరాబాద్లోని సాక్షి కార్యాలయంలో తిష్టవేసి సోదాలు చేయడం దారుణమన్నారు. ఇది పత్రిక స్వేచ్ఛకు విఘాతమన్నారు. పత్రికల్లో ఏదైనా వార్త వస్తే తప్పుడు సమాచారం అనుకుంటే ఖండించాలని, వివరణ కోరాలని, అప్పుడు సంబంధిత వార్త సంస్థ స్పందించకపోతే ప్రెస్ బ్యూరో ఇన్వెస్టిగేషన్ సంస్థలు, కోర్టుల ద్వారా న్యాయం పొందేందుకు నోటీషులు ఇవ్వాలన్నారు. కానీ, పోలీసులే నేరుగా చట్టాన్ని చేతిలోకి తీసుకొని ఎడిటర్‌కు నోటీషులు ఇవ్వడం, ఆయన వివరణ కోరడం పత్రిక స్వేచ్ఛను హరించడమే అవుతుందన్నారు. పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. వెంటనే సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ కు వినతిపత్రం సమర్పించారు. అంతకు ముందు కలెక్టరేట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని వినూత్నంగా అందించారు. కార్య క్రమంలో సాక్షి బ్యూరో, ఎడిషన్ ఇన్చార్జులు ఎం.రవి కుమార్, శ్రీనివాసులు నాయుడు, సీనియర్ ఫొటో గ్రాఫర్ డి.హుస్సేన్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు అవినాష్ శెట్టి, ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శివశంకర్. ఎర్రమల, సీనియర్ నాయకులు సునీల్‌కుమార్, మణిబాబు, సీనియర్ జర్నస్టులు రవి ప్రకాష్, చంద్రమోహన్, శ్రీనాథ్ రెడ్డి, పుల్లంరాజు, హరి తదితరులు పాల్గొన్నారు.

## అర్జున్ మృతదేహనికి నివాళి

విశాలాంధ్ర - బళ్లారి చౌరస్తా: కర్నూలులో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ బహిరంగ సభకి వెళ్తూ సభ ప్రాంగణం దారిలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన అర్జున్ మృతదేహన్ని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కనిగిరి ఎమ్మెల్యే ఎం.ఉగ్రనరసింహారెడ్డి, విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్ ప్రదీప్ కుమార్‌లు సందర్శించారు. శుక్రవారం కర్నూలు మండలం మునగాలపాడు గ్రామంలోని మృతుడి ఇంటికి వెళ్లిన వారు మృతదేహనికి పూలమాల వేసి నివాళి అర్పించి, అర్జున్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు, తిరుపతి ఎస్పీడీసీఎల్ సిఎండి సూచనల మేరకు మృతుని తండ్రి మద్దిలేటికి ఎమ్మెల్యేలు విద్యుత్ శాఖ తరపున రూ.5 లక్షలు పరిహారం అందజేశారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 18, అక్టోబరు 2025

## నిత్య అన్నదాన సత్రం నూతన అధ్యక్షునిగా యర్రనాగు పద్మనాభుడు

**విశాలాంధ్ర - ఆళ్లగడ్డ :** శ్రీ అహోబిల అఖిల భారత పద్మశాలీయ నిత్య అన్నదాన సత్రము నూతన అధ్యక్షునిగా యర్రనాగు పద్మనాభుడు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసినారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ప్రధాన కార్యదర్శిగా కోట రామయ్య, కోశాధికారిగా బర్రెంకల మల్లికార్జున, ఉపాధ్యక్షులుగా చేపూరి మద్దిలేటి, అవ్వారు బాలాజీ, చేపూరి సుబ్బరామయ్య, రంగ పినాకపాణి లు ప్రమాణ స్వీకారం చేశారు. వీరు మూడేళ్లపాటు ఈ పదవుల్లో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన వారందరూ అహోబిల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు వీరందరిని వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం ప్రధానార్చకులు వేణు గోపాలాచార్యులు, నూతన అధ్యక్షుడు యర్రనాగు పద్మనాభుడుని శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ పద్మశాలియుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. అన్నదాన సత్రాన్ని కమిటీ సభ్యుల సహకారంతో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు.

## ఘనంగా ప్రపంచ అనస్థీషియా దినోత్సవం

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల:** ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని ఇండియన్ అనస్థీషియా సొసైటీ, ఐఎంఏ నంద్యాల సహకారంతో స్థానిక మధుమణి సమావేశ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఇండియన్ అనస్థీషియా సొసైటీ నంద్యాల శాఖ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ మధుసూదన రెడ్డి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డ రాజంపేటకు చెందిన డాక్టర్ బాలరాజు, ఐఎంఏ నంద్యాల శాఖ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావులు విశిష్ట అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనస్థీషియా పితామహుడు విలియం థామస్ గ్రీన్ మార్టన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ 1846 అక్టోబర్ 16న అమెరికా మాసచూసెట్స్ నగరంలో విలియం థామస్ గ్రీన్ మార్టన్ మొట్ట మొదటిసారిగా మత్తుమందు ఇచ్చి ఆపరేషన్ చేయడం జరిగిందని, అందువల్ల అక్టోబర్ 16న ప్రపంచ వ్యాప్తంగా అనస్థీషియా దినోత్సవం నిర్వహిస్తున్నారని, వైద్యరంగ పురోగతిలో అనస్థీషియా వైద్యులదే కీలక పాత్ర అన్నారు. డాక్టర్ బాలరాజు, డాక్టర్ మధుసూదనరావులు మాట్లాడుతూ అనస్థీషియా రంగంలో వచ్చిన వినూత్న మార్పులు, ఉపయోగిస్తున్న అధునాతన పరికరాలు వైద్య ఆరోగ్య రంగాన్ని ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రభావితం చేసిందన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర రెడ్డి, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, ఐఎంఏ నంద్యాల శాఖ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు, కార్యదర్శి డాక్టర్ పనీల్ కుమార్, అధిక సంఖ్యలో నంద్యాల వైద్యులు పాల్గొన్నారు.

## అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించండి

**విశాలాంధ్ర - కర్నూలు సిటీ:** నగరంలో అనధికారిక లేఅవుట్లను ఈ నెల 23 లోపు క్రమబద్ధీకరించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ప్రజలను కోరారు. శుక్రవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకానికి విశేష స్పందన లభించిందని, రెండు విడతల్లో 1,180 దరఖాస్తులు అందుకున్నట్లు చెప్పారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే, దరఖాస్తులు వేగంగా ఇవ్వాలని ప్రజలకు కోరారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిసిసి వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష్, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీయూ ఆధ్వర్యంలో సేవా పుస్తకాలు పంపిణీ

**విశాలాంధ్ర-హొళగుంద:** నూతనఉపాధ్యాయులకు మండల ఎస్టీ సంఘం నాయకులు దొడ్డ బసప్ప, బీటీ కలందర్ల ఆధ్వర్యంలో శుక్రవారం సేవా పుస్తకాలను ఎంఈఓలు సుధారాణి, కబీర్ సాబ్ పంపిణీ చేశారు. ఎంఈఓ సుధారాణి మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులు సేవ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల సేవ పుస్తకాల వల్ల భవిష్యత్తు ఇమిడి ఉంటుందని, ఎవ్వరు అజాగ్రత్తపడకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్టీయూ సంఘం నాయకులు దొడ్డ బసప్ప, ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి పైపు పగిలినా.. పట్టించుకోని అధికారులు

**విశాలాంధ్ర - పెద్ద కడబూరు:** మండల పరిధి లోని చిన్నతుంబలం గ్రామంలో తాగునీటి పైపులైను పగిలినా మరమ్మతులు చేపట్టలేదని వలంటీర్ విభాగం మండల అధ్యక్షులు నరసింహాచారి, వైసీపీ నాయకులు కడబూరి, బాస్కర్ అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని నరసింహ స్వామి దేవాలయం దగ్గర ఉన్న తాగునీటి పైపు లైను పగిలి పోయి మూడు వారాలు అయినప్పటికీ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు రొడ్డుపై ప్రవహిస్తుండడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా తాగునీటి నీటి కొళాయి పైపు లైనుకు మరమ్మతులు చేయాలని కోరారు.

## పలువురు మంత్రులతో కేశవ రెడ్డి విద్యా సంస్థల అధినేత

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల:** భారత ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలు జిల్లాలో పర్యటించిన సందర్భంగా కర్నూలు విమానాశ్రయంలో కేశవరెడ్డి విద్యా సంస్థల అధినేత ఎన్.కేశవ రెడ్డి ప్రధానిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ప్రధానితో పాటుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కేశవ రెడ్డి కలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ భారత దేశాన్ని ప్రపంచంలో అగ్ర స్థానంలో నిలబెట్టగల సత్తా ఉన్న నాయకుడు మోదీ అని, ఆయన సారథ్యంలో దేశం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతున్నదని, అలాంటి మహా నాయకుడిని కలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాల వలన కలిగే సమస్యలపై అవగాహన కార్యక్రమం

**విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్:** ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాల వలన కలిగే పర్యావరణ సమస్యలు అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగ స్వామి నాయక్ మాట్లాడుతూ ప్లాస్టిక్ మన జీవితంలో సౌకర్యం కలిగిస్తున్నప్పటికీ, దాని నిర్లక్ష్య వాడకం పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తోందని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు మట్టి, నీరు, గాలిని కలుషితం చేయడంతో పాటు భూగర్భ జలాల నాణ్యతను తగ్గిస్తున్నాయని, జంతువులు, సముద్ర జీవులకు ఇది ప్రాణహాని కలిగిస్తోందని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కాల్చడం వలన హానికరమైన విష వాయువులు ఉత్పత్తి అవుతాయని, వాయు కాలుష్యానికి కారణమై శ్వాస సంబంధిత వ్యాధులను కలిగిస్తాయని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పునర్వినియోగం చేయడం ద్వారా పర్యావరణ రక్షణకు తోడ్పడాలని ఆయన విద్యార్థులకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో లెక్చరర్స్ రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సోమేష్, శ్రీధర్, బాల శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతోనే దేశ సేవకు అవకాశం

**విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్:** క్రమశిక్షణతోనే దేశ సేవ చేసే అవకాశం మెండుగా ఉంటుందని 9 (ఏ) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ జోష్బే ఫిలిప్ అన్నారు. శుక్రవారం క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో బాలికలకు ఎన్సిసి ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ జోష్బే ఫిలిప్ మాట్లాడుతూ ఎన్సిసి చేసిన వారికి ఎన్నో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. త్రివిధ దళాల్లో సేవ చేసే అవకాశం ఎన్సిసి క్యాడేట్లకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎన్సిసిలో ఉన్న సర్టిఫికెట్ల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఎన్సిసి కోటలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి ఆఫీసర్స్ అమైనా, విజయ వెంకట్, ఎస్ఎస్ రెడ్డిలు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయాలి

**విశాలాంధ్ర - రుద్రవరం:** ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేయాలి. ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆమె పరిశీలించారు. పాఠశాల పరిసరాలను, విద్యార్థుల హాజరు పట్టికను, విద్యార్థులకు ఏర్పాటు చేసిన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు, విధుల పట్ల సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వీడి విధులకు హాజరు కావాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు. కార్యదర్శి పాములేటి, గ్రామ మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ శివ ప్రసాద్ సిబ్బంది ఉన్నారు.

## చీఫ్ జస్టిస్‌పై దాడి.. ప్రజాస్వామ్యంపైనే దాడి

**విశాలాంధ్ర - చాగలమర్రి :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ మీద జరిగిన దాడి.. దేశ ప్రజాస్వామ్య విలువలపై దాడి అని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ తీవ్రంగా ఖండించారు. జస్టిస్ గవాయ్పై జరిగిన దాడికి నిరసనగా ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి ఆధ్వర్యంలో శుక్రవారం చాగలమర్రి పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ దస్తగిరికి వినతి పత్రం అందజేసారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి నాయకులు సంజీవరాయుడు, ప్రధాన కార్యదర్శి కసినేని ఓబులేసు, బాల ఓబన్న ఎంఆర్‌పిఎస్ నాయకులు లక్ష్మినారాయణ, కత్తి శ్రీను, జగన్. రమణ, రాజేష్, ప్రకాష్, బుజ్జి, నాగరాజు పాల్గొన్నారు.

**విశాలాంధ్ర - హొళగుంద:** భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మండల ఎమ్మార్పీఎస్ సంఘ అధ్యక్షుడు ఎస్కె కెంచప్ప డిమాండ్ చేశారు. మండల ఎంఆర్పిఎస్ సంఘం అధ్యక్షుడు కెంచప్ప ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అలాగే తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సంఘం నాయకులు మల్లికార్జున, దేవప్ప, పకీరప్ప, శేషగిరి, వెంకటేష్, కన్నారావు, రమేష్, గోవర్ధన్, వీరేష్ ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి నాయకులు తదితరులు పాల్గొన్నారు

**విశాలాంధ్ర - జూపాడుబంగ్లా:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై కోర్టులో దాడి చేయడం అమానుషమని ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు విజ్జి మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ హనోక్ మాదిగ తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ, నంద్యాల జిల్లా ఇంచార్జ్, జాతీయ నాయకులు మున్నంగి నాగరాజు ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో సనాతన వాది ఆర్ఎస్ఎస్ మత సంస్థకు చెందిన రాకేష్ కిషోర్ అనే ఉన్మాది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడికి పాల్పడడం హేయమైన చర్యాగా ఖండిస్తున్నామని వారన్నారు. అనంతరం తహస్లీల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ సరళకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నవీన్, జయరాజు, స్వాములు, స్వామన్న, యేసు రాజు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

**విశాలాంధ్ర - కొలిమిగుండ్ల:** భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. మండల కేంద్రంలోని జమ్మలమడుగు సర్కిల్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి మండల అధ్యక్షులు తోళ్ల నాగాంజనేయ, గోపాల్ గారి దస్తగిరి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి, అనంతరం తాసిల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో న్యాయవాది మంద విజయ్ మాదిగ, బి.దస్తగిరి మాదిగ, కె.రామచంద్ర, నారాయణ, సౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

**విశాలాంధ్ర- కోవెలకుంట్ల:** ఢిల్లీలోని సుప్రీంకోర్టు హాల్ లోనే ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గావాయ్‌పై దాడి చేసిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని కోరుతూ శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ నుండి ర్యాలీగా వెళ్లి జమ్మలమడుగు క్రాస్ రోడ్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మహాజన షోషలిస్ట్ పార్టీ మండల అధ్యక్షులు నవీన్ మాదిగ, దండు రామ సుబ్బయ్య, నాగేశ్వరావు, రాజు, పౌర హక్కుల సంఘం నాయకులు కరీం బాష, ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పరుశరామ్, నాగరాజు, లక్షినారాయణ, రవితేజ, ఠాగూర్, బాలు, సుబ్బారాయుడు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**విశాలాంధ్ర - మిదుతూరు:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి పై దాడి చేసిన రాకేష్ కిషోర్ ను కఠ్నంగా శిక్షించాలని ఎం ఎస్ పి జిల్లా అధికార ప్రతినిధికోట ప్రభాకర్ మాదిగ అన్నారు. శుక్రవారం మిదుతూరు బస్టాండ్ కూడలి నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, ఎంఈఎఫ్ అనుబంధ సంఘాల దళిత నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సమస్యతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ శ్రీనివాసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ సతీష్, ఎమ్ఎస్పీ అధ్యక్షులు గోపాల వెంకటరమణ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గద్దల ఆనందు, ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు పవన్ కళ్యాణ్, ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య, ఎమ్మార్పీఎస్ కార్యదర్శి శ్రావణ పాల్గొన్నారు.

**విశాలాంధ్ర - బనగానపల్లె:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గావాయ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయంలో తాహసిల్దార్ నారాయణ రెడ్డికి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మూలింటి పెద్ద మునయ్య మాదిగ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. లాయర్ జేమ్స్ మాదిగ, ఎర్రన్న మాదిగ, మిద్దె రామకృష్ణ, బుద్దిస్ట్, ఓబయ్య ట్రైలర్ చిన్న స్వామి, సాదు కొట్టం శేఖర్, తిరుపాలు, పసుపల పెద్దయ్య, జయన్న, సుబ్బరాయుడు, మంగం పేట పిచ్చి మద్దిలేటి, జెట్టి మద్దిలేటి, క్రిష్ణగిరి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

**విశాలాంధ్ర - వెలుగోడు :** పట్టణంలో సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని ఎంఎస్‌పీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ చంద్ర శేఖర్‌కు ఎంఎస్‌పి జిల్లా ఉపాధ్యక్షులు నాగశేషులు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. నిరసన కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు నవీన్ జిల్లా నాయకులు వెంకటరమణ, టౌన్ అధ్యక్షులు మధు, రామచంద్రుడు వెంకటరమణ రావుఫ్, రహంతుల్లా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం

**విశాలాంధ్ర - చాగలమర్రి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికగా నాతోనే మార్పు అనే అంశంపై, అంతర్జాతీయ బాలిక దినోత్సవం గురించి, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు శివలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీల, కేజీబీవీ ప్రత్యేక అధికారి స్వప్న కుమారి గెలుపొందిన విద్యార్థినులకు దేశభక్తి గల ప్రముఖ నాయకుల చిత్రపటాలను, పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో జీఎంఎస్‌కేలు సాగర కుమారి, సౌభాగ్యలక్ష్మి, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, అంగన్వాడి టీచర్లు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## కార్తీక మాస మహోత్సవ ఆహ్వాన పత్రిక అందజేత

**విశాలాంధ్ర - బనగానపల్లె :** పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నంద్యాల జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి శ్రీ ఉమా మహేశ్వర స్వామి ఆహ్వాన పత్రికను రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆలయ ఈవో పాండురంగారెడ్డి ఈ నెల 22 నుంచి నవంబర్ 20 వరకు కార్తీక మాస మహోత్సవాలకు మంత్రి దంపతులు తప్పక హాజరు కావాలని కోరారు. అనంతరం పట్టణ అర్బన్ సిఐ కార్యాలయంలో ప్రవీణ్ కుమార్, మంజునాథ్ రెడ్డి, ఎస్సై దుగ్గిరెడ్డి ఉమామహేశ్వర స్వామి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.పాండురంగారెడ్డి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బండి మౌలిశ్వర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి అంబాల రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, సంకేశ్వర్ రెడ్డి, రామ్ శేఖర్, తిరుమలయ్య, భరతుడు, ఆలయ అధికారులు రమేష్ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలి

**విశాలాంధ్ర - కర్నూలు సిటీ:** కూటమి ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు సూచించారు. నగరంలోని బంగారు పేటలో ఉన్న జిల్లా మతి శాఖ కార్యాలయాన్ని బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, ఉమ్మడి కర్నూలు జిల్లా డీఎస్సీఎస్ చైర్మన్ బిఎస్ నవీన్ కుమార్‌తో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కొల్లు పెద్దిరాజు మాట్లాడుతూ మత్స్యశాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న పలు సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫిష్ ఫారమ్‌ను పరిశీలించి, చేపల పెంపకంపై సమాచారం సేకరించారు. ఇంచార్జీ ఎఫ్‌డిఓకు పలు సూచనలు చేశారు. బొమ్మన శ్రీధర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బెస్త సమాజ అభివృద్ధికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ టీజీ రమేష్ చిరంజీవి, ఎద్దుల వెంకటేష్, అడ్వకేట్ శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

## ఉల్లి పంట పక్వానికి వచ్చిన తర్వాతనే కోత జరిగేలా పర్యవేక్షించాలి

**విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు :** ఉల్లి పంట పక్వానికి వచ్చిన తర్వాతనే కోత జరిగేలా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి వ్యవసాయ,అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఖరీఫ్ సీజన్‌లో వేసిన ఉల్లి పంటకు సంబంధించి గ్రామాల వారిగా పంట కోత షెడ్యూల్, వాటిని మార్కెటింగ్ చేసే విధానంపై, రబీ సీజన్‌లో వేసే పంటల ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించే అంశంపై గ్రామ, మండల స్థాయి, డివిజన్ స్థాయి వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్‌లో నాటిన ఉల్లి పంటకు సంబంధించి, పంట కోత ఒకేసారి జరిగి, మార్కెట్‌కి తీసుకుని రాకుండా, 110- 120 రోజులు దాటిన తర్వాతే పంట కోత తీసే విధంగా వ్యవసాయ,ఉద్యాన శాఖల అధికారులు పర్యవేక్షించాలన్నారు. కోత కోసిన వెంటనే మార్కెట్‌కి తీసుకొని రాకుండా ఉల్లిగడ్డను పొలంలో బాగా ఆరబెట్టడం వలన గడ్డల నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. గ్రేడింగ్ చేసుకునే విధంగా చూడాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజా కృష్ణా రెడ్డి, ఏపీఎంఐపి పిడి శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

## పెయ్య దూడలు మాత్రమే పుట్టే సూదులపై అవగాహన కల్పించాలి

**విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్:** పశు వైద్య శాలలో ఇంచార్జి సహాయక సంచాలకులు డా.వెంకటేశ్వర్లు నెల వారి సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు శ్రీపతి రావు పేట రైతు సేవా కేంద్రం ఆకస్మిక తనిఖీ చేశారు. పెయ్య దూడలు పుట్టేందుకు రూ. 150 రూపాయలకే సూదులు అందుబాటులో ఉన్నాయని, రైతులకు అవగాహన కల్పించి ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలన్నారు. అన్ని రకాల టీకాలు వంద శాతం పశువులకు వేయించి ఆరోగ్యకర మైన పాలు ఉత్పత్తి చేయాలని, స్థానిక రైతు మస్తాన్ రావు చాఫ్ కట్టర్ వినియోగించడం పరిశీలించి, గడ్డి వృథా అరికట్టడానికి మిగతా రైతులు చాఫ్ కట్టర్ వినియోగించాలని అవగాహన కల్పించారు. డాక్టర్లు అరుణ, అశోక్, భువనేశ్వరి, పారా సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతినికేతన్ విద్యార్థుల రాష్ట్ర స్థాయి విజయం

**విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల:** క్రాంతి నగర్‌లోని శ్రీ శాంతినికేతన్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను చాటుతూ గర్వించదగిన ఫలితాలను సాధించారు. ఇటీవల నిర్వహించిన కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ఈ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం విశేషం. ఏడో తరగతి విద్యార్థి ఎస్.కార్తిక్ రాష్ట్ర స్థాయి రెండో ర్యాంక్, పదో తరగతి విద్యార్థి డి.పవన్ కుమార్ రాష్ట్ర స్థాయి 3వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు మెడల్, మొమెంటోతో పాటు నగదు బహుమతులు అందజేశారని, కార్తిక్‌కు రూ.2 వేల నగదు బహుమతి, పవన్ కుమార్‌కు వెయ్యి రూపాయల నగదు బహుమతి అందజేశా రన్నారు. ఐఐటి ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ రామకృష్ణ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ ఈ విజయాలు తమ పాఠశాలకు గర్వకారణమని, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఐఐటీ ఫౌండేషన్ సిబ్బంది మార్గదర్శకత్వం కలగలిపిన ఫలితమే ఈ విజయమన్నారు.